ప్రజాశక్తి

సోమవారం 11 సెప్టెంబర్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

గురువులకు జీతాల వెతలు



- పదో తేదీ వచ్చినా అందని జీతాలు
- పూర్తికాని కేడర్ స్ట్రెంగ్త్ అప్‌డేషన్ ప్రక్రియ
- వేధిస్తున్న సాంకేతిక సమస్యలు

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయులను జీతాల సమస్య వెంటాడుతూనే ఉంది. మూడు నెలలుగా బదిలీలు, ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులకు జీతాలు అందలేదు. ఈ నెల మిగిలిన ఉపాధ్యాయులకూ జీతాలు జమ కాలేదు. సప్లిమెంటరీ బిల్లులు సబ్మిట్ చేయటానికి ఆదివారంతో గడువు ముగిసింది. ఇంకా కేడర్ స్ట్రెంగ్ అప్‌డేషన్ ప్రక్రియ, అందరికీ బిల్లులు వేయటం పూర్తి కాలేదు. దీంతో ఆగస్టు నెల జీతాలు సెప్టెంబర్‌లోనే జమవుతాయనే నమ్మకం లేదు. ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంగ్త్ అప్‌డేట్ కాకపోవటంతో టీచర్ల వివరాలు డిడిఒల లాగిన్‌లో చూపించట్లేదు. దీంతో వారికి జీతాల బిల్లులు వేయటం సాధ్యం కావట్లేదు. కొన్ని మండలాల్లో అయితే కొత్తగా విధుల్లో చేరిన ఎంఇఒలు (డిడిఒ) పేర్లే సిఎఫ్ఎంఎస్‌కు అనుసంధానం కాకపోవటంతో వారి పరిధిలోని ఉపాధ్యాయులకు జీతాలు ప్రశ్నార్థకంగా మారాయి.

గుంటూరు, ప్రత్తిపాడు, తుళ్లూరు మండలాల్లో కొత్తగా చేరిన ఎంఇఒల పేర్లు సిఎఫ్ఎంఎస్‌కు అనుసంధానం కాలేదు. వీరు ఎస్‌జిటిలకు వేతనాలు వేయాల్సి ఉంటుంది. గుంటూరు జిల్లాలో 5 వేల మంది వరకూ ఎస్‌జిటి ఉపాధ్యాయులు, 3 వేల మంది స్కూల్ అసిస్టెంట్లు ఉంటారు. 18 మండలాల పరిధిలో ఎస్‌జిటిలకూ ఎవ్వరికీ ఇంతవరకూ వేతనాలు అందలేదు. స్కూల్ అసిస్టెంట్లకు 30శాతమే జీతాలు అందినట్లు తెలిసింది. డిఇఒ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికీ ఈనెల జీతాలు అందలేదు. వారి పేర్లు కూడా అప్‌డేట్ చేస్తుండంతో ఈ ప్రక్రియలో కొందరు ఉద్యోగుల ఐడిలు కనిపించట్లేదు.

వేతనాలు ఒక సమస్యైతే, కేడర్ స్ట్రెంగ్ అప్‌డేషన్ ప్రక్రియలో ఉపాధ్యాయులందరి వివరాలు కనిపించకపోవటం, ఒకచోట పనిచేస్తుంటే మరొక మండలంలో చూపించటం, ఐడిలు కనిపించకపోవటం వంటి కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రత్తిపాడు మండలం, తుమ్మలపాలెంలోని ఒక పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు ఉండగా, 40 మంది పని చేస్తున్నట్లు వెబ్‌సైట్‌లో చూపిస్తోంది. మండంలోని ఇతర పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పేర్లన్నీ తుమ్మలపాలెం స్కూల్లో చూపిస్తోంది. దీనిపై డిఇఒ కార్యాలయం నుండి విద్యాశాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపించారని తెలిసింది. కాకుమాను, తుళ్లూరు, పొన్నూరు ఇలా ప్రతి మండలంలో ఈ విధమైన సమస్య వెలుగు చూసింది. వాటిని సరి చేయాల్సి ఉంది. దీంతో డిడిఒలు (ఎంఇఒలు) వెబ్‌సైట్‌లో ఉన్న సక్రమంగా ఉన్న వారికే జీతాలు బిల్లులు వేశారు. కాగా 5వ తేదీ తర్వాత ఎరియర్స్ బిల్లులు సబ్మిట్ చేసిన ఉపాధ్యాయులకు జీతాలు జమ కాలేదు.

ఇదిలా ఉంటే గత మూడు నెలలుగా జీతాలు జమ కాకపోవటంతో

2లో



మురికిపూడిలో ఖాళీగా ఉన్న పొలాలు

చినుకు రాలదు.. పొలం సాగదు..

- సాగు భూమిలో సగం వరకూ ఖాళీ
- గతేడాదితో పోలిస్తే 100 మిల్లీ మీటర్ల వర్షపాతం లోటు
- అగమ్యగోచరంగా రైతులు దుస్థితి
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై కొరవడిన ప్రచారం, ప్రోత్సాహం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎన్ని కష్టనష్టాలున్నా తట్టుకుని రైతులు పెట్టుబడులకు డబ్బులు సమకూర్చుకున్నారు. కౌలురైతులు అక్కడా ఇక్కడా అప్పులు తెచ్చి కౌలు చెల్లించి పొలాలు తీసుకున్నారు. అయితే వానలు మాత్రం మొహం చాటేయడంతో వ్యవసాయం ముందుకు సాగడం లేదు. గతేడాదికంటే సగానికి పైగా పొలం సాగు నోచకపోగా మొత్తం సాగు భూమిలో సుమారు సగం వరకూ భూమి ఖాళీగా పడి ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు, కౌలురైతులు సాగు చేయకుండానే నష్టపోయే అవకాశం ఉండగా కూలీలు పనుల్లేక ఆర్థిక ఇబ్బందుకుల చేరువ కానున్నారు.

చిలకలూరిపేట మండలంలో పత్తి, మిర్చి పొగాకు, శనగలు ప్రధాన పంటలు కాగా ఇతర కూరగాయాలు, అపరాలు అక్కడడక్కడా పరిమితంగా సాగవుతుంటాయి. మండలంలో మొత్తం సాగువిస్తీర్ణం 18 వేల ఎకరాలు కాగా పత్తి గతేడాది మాదిరే 2,500 ఎకరాల్లో సాగైంది. మిర్చి గతేడాది 2,800 ఎకరాల్లో సాగవగా ప్రస్తుతం వెయ్యి ఎకరాల్లోనే సాగైంది. వర్షాలు పడితే

2లో



తాడేపల్లి సభలో మాట్లాడుతున్న సిహెచ్ బాబూరావు

దేశం పేరు కాదు..

విధానాలు మారాలి..

- పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ సిహెచ్ బాబూరావు
- చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి సభలు - పలుచోట్ల ఘన నివాళులు

8లో

నివాసితులకు హక్కు పత్రాలు

- జగనన్న భూరక్షాపథకం ద్వారా సమగ్ర రీ సర్వే
- యాజమాన్య ధ్రువీకరణ జారీకి చర్యలు
- ప్రజాశక్తితో గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి కేశవరెడ్డి

8లో



నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో దీక్షలు చేస్తున్న టిడిపి శ్రేణులు

6లో

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ

టిడిపి శ్రేణుల నిరాహార దీక్షలు

నేడు బంద్

- ఉమ్మడి జిల్లా అంతటా 144 సెక్షన్
- చంద్రబాబు అరెస్టుపై కొనసాగిన నిరసనలు
- రిమాండ్ సమాచారంతో టిడిపి నేతల్లో నిరాశ

2లో



జిజిహెచ్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లోని రోగులకు వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. ఆదివారం ఆసుపత్రిలోని పోస్ట్‌క్యాద్ వార్డును ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఎన్‌ఒలుగా పని చేస్తున్న ఇద్దరికి డ్రెస్‌కోడ్ లేకపోవడంపై అసంతప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో రోగి సంరక్షణ చెయ్యడం కోసం ఎంఎన్‌ఒ ల పాత్ర పవిత్రంగా భావిస్తారని ఆయన చెప్పారు. డ్యూటీలో ఉన్న ఇద్దరూ డ్రెస్ కోడ్ లేకుండా వచ్చారని అన్నారు. వార్డులో పడకలు శుభ్రంగా లేవని అన్నారు. డ్యూటీలో ఉండాల్సిన మెడికల్ డాక్టర్ అందుబాటులో లేరని చెప్పారు. ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెడుతోందని ఆ డబ్బు తో వార్డు నిర్వహణ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

గురువులకు జీతాల వెతలు

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధ్యాయులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ఇప్పుడు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. గృహ సంబంధిత, పెళ్లి, వాహనం ఇతర అవసరాల కోసం బ్యాంకుల నుండి రుణాలు తీసుకున్న వారు, బ్యాంకు ఖాతాల్లో ఇఎంఐల కోసం తగిన నిల్వలు లేక డిఫాల్టర్లుగా మారుతున్నారు. అంతే కాకుండా ప్రతినెలా ఉపాధ్యాయుల జీతాల నుండి ఎపిజిఎల్ఐ, పిఎఫ్, గ్రూప్ ఇన్సూరెన్స్, ఇహెచ్ఎస్ వంటి ప్రభుత్వ డిడక్షన్‌లు కూడా నిలిచిపోయాయి. ఎపిజిఎల్ఐకి ఉపాధ్యాయుల వాటా మూడు నెలలుగా జమ కాకపోవటంతో అనుకోని ప్రమాదం జరిగితే నిబంధనల ప్రకారం వారికి రావాల్సిన సౌకర్యాలేవీ దక్కే అవకాశం లేదని అంటున్నారు.

కేడర్ స్ట్రెంగ్త్ అప్‌డేషన్‌కు సంబంధించి వివరాలు జిల్లా విద్యాశాఖ అధికారులు సిఎఫ్ఎంఎస్‌కు పంపించారు. అవి అప్‌డేట్ కావటానికి మూడు నాలుగు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని తెలిసింది. మరోవైపు ఎరియర్స్ బిల్లులు వేసే గడువు ముగియటంతో వారందిరికీ ఈనెల్లోనే బిఉల్లలు వేస్తారా? వచ్చేనెల జీతాలతోపాటు వేస్తారా? అన్నది ప్రశ్నార్థకం. ప్రభుత్వం ఉపాధ్యాయుల జీతాల సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టి యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు అన్నీ ఈనెల్లోనే జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండ ను ఆదివారం పర్యాటకులు భారీగా సందర్శించారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండ కు వివిధ లాంచీలలో కొండకు వెళ్లిన పర్యాటకులు అక్కడ మ్యూజియంలో ఉన్న బుద్ధిని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు,9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధ శాల, స్నానాల గట్టు చూశారు. అనంతరం అనుపు లోని యాంపి స్టేడియం, అశ్వమేద యగ్నశాల, శ్రీరంగనాథస్వామి దేవాలయం, తదనంతరం 60 అడుగుల ఎత్తునుండి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు.



నేడు బంద్

- ఉమ్మడి జిల్లా అంతటా 144 సెక్షన్
- చంద్రబాబు అరెస్టుపై కొనసాగిన నిరసనలు
- రిమాండ్ సమాచారంతో టిడిపి నేతల్లో నిరాశ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చంద్రబాబు అక్రమ అరెస్టునకు నిరసనగా సోమవారం రాష్ట్ర వ్యాప్త బంద్‌లో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా బంద్ నిర్వహించేందుకు టిడిపి నాయకులు సన్నద్ధం అవుతున్నారు. ఆదివారం రాత్రి 7గంటల ప్రాంతంలో చంద్రబాబుకు విజయవాడ కోర్టు రిమాండ్ విధించగానే పోలీసులు అప్రమత్తం అయ్యారు. వెంటనే జిల్లాలోని అన్నిమండల కేంద్రాల్లో 144 సెక్షన్ విధిస్తున్నట్టు అధికారులు ఎక్కడికక్కడ ప్రకటించారు. పోలీసులు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చి బందోబస్తు నిర్వహించారు. కూడలి ప్రదేశాల్లో పికెట్లు ఏర్పాటు చేశారు. చంద్రబాబుకు రిమాండ్ విధించగానే సత్తెనపల్లి,గుంటూరులో టిడిపి కార్యకర్తలు నిరసన తెలిపారు. గుంటూరు లక్ష్మీపురంలో టిడిపి కార్యకర్తలు సిఎంజగన్ దిష్టిబొమ్మను తగులబెట్టారు. వెంటనే పట్టాభిపురం సిఐ రాజశేఖర్‌రెడ్డి వచ్చి టిడిపి నాయకుడు సుఖవాసి శ్రీనివాసరావుతో పాటు మరికొందరిని అదుపులోకి తీసుకున్నారు.



లక్ష్మీపురం సెంటర్లో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టిడిపి శ్రేణులు

నగరంలో సెక్షన్ 30 అమలులో ఉందని సిఎం దిష్టిబొమ్మ దగ్ధం చేసిన వారిపై కేసు నమోదు చేస్తున్నామని సిఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు బందోబస్తు ఏర్పాట్లను ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ పర్యవేక్షించారు. పల్నాడు జిల్లాలో పరిస్థితిని ఎస్‌పి రవిశంకరరెడ్డి పరిశీలించారు. సోమవారం టిడిపి నాయకులు బంద్‌లో పాల్గొనకుండా ముందు జాగ్రత్తగా ఆదివారం రాత్రినుంచి వారి ఇళ్ల ముందు పోలీసులనుకాపాలాగా ఉంచుతున్నారు. టిడిపి నాయకులందరిని గృహనిర్బంధంలో ఉంచాలని నిర్ణయించారు. బంద్‌కు ఎవ్వరూ సహకరించాదని ఇప్పటికే అధికారులు వ్యాపారులకు, ఇతర సంస్థలకు తెలియజేస్తున్నారు. ప్రజా కార్యకలాపాలు యథాతథంగా జరిగేలా చూసేందుకు ప్రభుత్వ యంత్రాంగం సన్నాహాలు చేస్తుంది. బంద్ నేపథ్యంలో విద్యా సంస్థల వారు ముందుగానే శెలవు ప్రకటించాయి. మరో వైపు చంద్రబాబు నాయుడ్ని తాడేపల్లిలోని సిఐడి సిట్ కార్యాలయం నుంచి ఆదివారం తెల్లవారుజామున విజయవాడకు తరలించారు. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యపరీక్షల అనంతరం తిరిగి తాడేపల్లి తీసుకువచ్చారు. ఉదయం 5.30 గంటల సమయంలో తిరిగి తాడేపల్లి నుఒంచి విజయవాడ కోర్టుకు తీసుకువెళ్లారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు చంద్రబాబుకు బెయిల్ వస్తుందా...రిమాండ్ విధిస్తారా అనే అంశంపై తీవ్ర ఉత్కంఠ కొనసాగింది. ప్రజలంతా టివిలకు అతుక్కుపోయి ఉత్కంఠగా ఎదురుచూశారు. తీవ్ర ఉత్కంఠ నడుమ రాత్రి 7 గంటల సమయంలో చంద్రబాబుకు రిమాండ్ విధించారని సమాచారం రావడంతో టిడిపి కార్యకర్తలు, నాయకులు తీవ్రనిరాశకు గురయ్యారు. కొంత మంది రోడ్లపైకి వచ్చి నిరసనకు ప్రయత్నించడంతో పోలీసులు ఎక్కడికక్కడ నియంత్రణ చర్యలు చేపట్టారు. బంద్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లాలోని అన్ని డిపోల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు పహారా పెంచారు.

దుబాయ్‌లో ఆర్యవైశ్య మహాసభకు సన్నాహాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

త్వరలో ఆర్య వైశ్య మహాసభను దుబాయ్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ తెలిపారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సమావేశం ఆదివారం మధ్యాహ్నం అరండల్‌పేట ఆరో లైనులో ఐక్యఫంక్షన్ హాలులో నిర్వహించారు. మహాసభ జిల్లా శాఖ అధ్యక్షులు గోపవరపు శివ అధ్యక్షత వహించారు. టంగుటూరి రామకృష్ణ మాట్లాడుతూ మహాసభ విభాగాలు ప్రతి రాష్ట్రంలో ఉన్నాయని చెప్పారు. 20 రాష్ట్రాలలో, 57 దేశాల్లో విభాగాలు పని చేస్తున్నాయని తెలిపారు. దుబాయ్‌లో భారీ స్థాయిలో జరిగే మహాసభకు కేంద్ర మంత్రులు, రాజవంశీకులు, ఇండోనేషియా, వ్యాపార దిగ్గజాలు వస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో రాజకీయ పరంగా తగినన్ని సీట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో వ్యాట్, టర్న్ ఓవర్ టాక్సలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేసి ప్రభుత్వాలను గద్దె దించామని అన్నారు. గోపవరపు శివ మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభను జయప్రదం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జూలకంటి శ్రీనివాసరావు, కోరిపల్లి జయశ్రీ, మహాసభ ఎపి నార్త్ విభాగం అధ్యక్షులు కోన శ్రీనివాసరావు, గ్రంధి ధనలక్ష్మీ, ఉపాధ్యక్షులు మద్ది రవీంద్ర బాబు, ఎం.రవీంద్రబాబు, గార్లపాటి రవికిరణ్, చింతా నాగేశ్వరరావు, ఎం.సాంబశివరావు, టి.రాణి పాల్గొన్నారు.



చినుకు రాలదు.. పొలం సాగదు..

(మొదటి పేజీ తరువాయి)

మరో వారం రోజుల వరకూ మిర్చి సాగుకు అవకాశం ఉండి మరో వెయ్యి ఎకరాల్లో సాగవుతుందని అంచనా. పత్తి సాగుకు సమయం ఇప్పటికే మించిపోయింది. 5 వేల ఎకరాల్లో పొగాకు, శనగ పంటలు సాగుచేస్తుంటారు. ఆక్టోబర్ చివరి వారం నుండి వీటి సాగు ప్రారంభం అవుతుంది. అయితే వేమవరం, మురికిపూడి, రామచంద్రపురం, కొత్తరాజాపేట తదితర గ్రామాల్లోని 1500 ఎకరాల్లో పొగాకు నారుమళ్లు వేశారు. ఎకరా నారుమడి 700 ఎకరాల సాగుకు సరిపోతుంది. మండలంలో ప్రతిఏడాదీ సుమారు 1100 ఎకరాల్లోనే పొగాకు సాగువుతుంది. మిగతా నారును ఇతర ప్రాంతాలకు విక్రయిస్తుంటారు.

మొత్తంగా మండలంలోని 18 వేల ఎకరాల సాగుభూమిలో 5 వేల ఎకరాల్లో పొగాకు, శనగ సాగు అక్టోబర్‌లో మొదలవుతుంది. మిగతా 13 వేల ఎకరాల్లో ఇప్పటి వరకు పత్తి, మిర్చి, సోయా తదితర పంటలు సుమారు 4 వేల ఎకరాల వరకూ సాగయ్యాయి. ఇంకా 9 వేల ఎకరాల భూమి ఖాళీగా ఉంది. ఇది మొత్తం సాగు భూమిలో సగం. గతేడాది ఇదే సమయానికి 8 వేల ఎకరాల వరకూ సాగు పూర్తవగా ఈ ఏడాది వర్షాలు లేని కారణంగా ఏ పంటలు వేయాలో రైతులకు పాలుపోవడం లేదు.

చిలకలూరిపేట మండలంతోపాటు నియోజకవర్గంలో మొత్తం సాగు భూమిలో 80 శాతం పొలాలు వర్షాధారంగా సాగయ్యేవే. మిగతా 20 శాతం పొలాలు మాత్రమే సాగర్ కాల్వలు, బోర్లు, చిలకలూరిపేట పట్టణంలోని డ్రెయినేజీ కాల్వ కింద సాగవుతాయి. గతేడాది కంటే ఈ ఏడాది వర్షపాతం దారుణంగా పడిపోయిన కారణంగా సాగు ముందుకు కదలడం లేదు. 2021 ఆగస్టు 31 నాటికి మండలంలో 255.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా గతేడాది 183.8 మిల్లీమీటర్లు నమోదైంది. ఈ ఏడాది అదే సమయానికి 84.6 మిల్లీ మీటర్లే నమోదైంది. దీంతో వర్షాధార పొలాల్లో సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. దీంతో వ్యవసాయ కూలీలకూ పనుల్లేక ప్రత్యామ్నాయ మార్గాలను వెదుక్కుంటున్నారు.

ఈ నేపథ్యంలో కొంతమంది రైతులు ప్రత్యామ్నా పంటల సాగుకు ప్రయత్నిస్తున్నారు. నీటి అవసరం తక్కువగా ఉండే ఆరుతడి పంటలైన సోయాబీన్, అముదాలు, కంది తదితర పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. గతేడాది పోలూరులో నాలుగైదు ఎకరాల్లో ఈ పంట సాగు చేయగా ఈ ఏడాది సాగు రెట్టింపైంది. రాజాపేట, గొట్టిపాడులోనూ కొంతమంది రైతులు సోయాబీన్ సాగుకు సిద్ధమవగా మండలం మొత్తంలో 50 ఎకరాలోల అయినా సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

సోయాబీన్ సాగుకు నీటి తడులు పెద్దగా అవసరం ఉండదు. రెండు మూడుసార్లు పెడితే సరిపోతుంది. ఈ పైరుకు తెగుళ్ల బెడతా పెద్దగా ఉండదని, పెట్టుబడి ఖర్చులూ తక్కువే. ఎకరాకు 25-30 కిలోల విత్తనాలు సరిపోతాయి. కిలో విత్తనాల ధర రూ.110-125 వరకూ ఉంటుంది. మూడు నెలల్లో పంట చేతికొస్తుంది. ఎకరాకు



10-12 క్వింటాళ్ల దిగుబడి ఉంటుంది. క్వింటాళ్ ధర రూ.9-11 వేల వరకూ దక్కే అవకాశం ఉంది. ఈ పంట పూర్తయిన వెంటనే రెండో పంటగా అదే పంట సాగు చేయొచ్చు లేదా వేరే పంట వేసుకోవచ్చు. పంట పూర్తయ్యాక ఆ వ్యర్థాలు పొలానికి ఎరువుగానూ ఉపయోగపడతాయి.

దీంతోపాటు మూణ్ణెల్లలో చేతికొచ్చే ఆముదాల పంట కూడా రైతులకు మంచి ఆదాయం ఇస్తుంది. రెండున్నర కిలోలతో ఎకరా సాగు చేయొచ్చని, కిలో విత్తనాలు రూ.450 వరకూ ఉంటాయని, రెండుసార్లు పురుగుల మందు పిచికారీ చేస్తే సరిపోతుందని, ఎకరాలకు 10 క్వింటాళ్ల దిగుబడి ఉంటుంది. అయితే వీటిపై రైతులకు అవగాహన కల్పించడం, వారిని సాగుకు సమాయత్తం చేయడంలో యంత్రాంగం అంతగా శ్రద్ధ పెట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించాలని, విత్తనాలను ఉచితంగా అందించి రైతులను సాగుకు ప్రోత్సహించాలని రైతు నాయకులు కోరుతున్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-నకరికల్లు

పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ నకరికల్లు తహశీల్దార్ కార్యాలయాన్ని ఆదివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ముందుగా 2022 1 జూన్ నుండి ఇప్పటి వరకు వరకు తొలగించిన ఓట్ల వివరాలు, జీరో డోర్ నెంబర్లు, ఒకే డోర్ నెంబర్‌లో పది మంది కంటే ఎక్కువ నమోదైన ఓట్ల వివరాలు, వందేళ్లు పైబడిన ఓటర్ లిస్ట్ లో నమోదైన వారి వివరాలకు సంబంధించిన నివేదికలను పరిశీలించారు. ప్రతి గ్రామంలో ఇంటింటికి తిరిగి ఎన్నికల నియమావళి ప్రకారం వచ్చిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే,బిఎల్వోల నివేదిక, ఆన్‌లైన్ ప్రాసెస్ అంతా పర్యవేక్షించి పెండింగ్ నివేదికలను త్వరతగతిన పూర్తి చేయాలని తహశీల్దార్ నగేష్‌ను ఆదేశించారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్



ప్రత్తిపాడు బస్టాండ్ సెంటర్ లో నిరాహారదీక్షలో ఎంఆర్ పి ఎస్ నాయకులు

పార్లమెంటు సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టండి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఆర్‌పిఎస్,ఎం ఎస్ పి జాతీయ కమిటీ పిలుపు మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గం కన్వీనర్ తోడేటి యేసుపాదం మాదిగ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రాలలో రిలే నిరాహారదీక్ష శిబిరం ప్రాంభించిన విషయం తెలిసిందే. రెండవ రోజు జరుగుతున్న దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఎం ఎస్ పి సీనియర్ నాయకులు కె.అంకయ్య మాదిగ, డి.సాంబయ్య మాదిగ మాట్లాడుతూ, సెప్టెంబర్ 18 నుండి 22 వరకు జరగ నున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో నే ఎస్ సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టేలా కేంద్ర ప్రభుత్వంపైరాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచేలా తమ వంతు సహకారాన్ని అందిస్తామన్నారు. తక్షణమే అఖిలపక్ష కమిటీని ఢిల్లీకి పంపి, ఎస్ సి వర్గీకరణ ద్వారా మాదిగలు , మాదిగ ఉపకులాలకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిద్దేల జయపాల్ మాదిగ, మంద రవి మాదిగ, చిన్న మాదిగ, కనుమూరి అంకమ్మరావు మాదిగ, ప్రత్తి పాడు దేవదానం మాదిగ, దేవరకొండ నాగరాజు మాదిగ, సిద్దేల నరేశ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు అరెస్టుకు నిరసనగా దీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అరెస్టును ఖండిస్తూ గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ కార్యాలయంలో టిడిపి శ్రేణులు ఆదివారం సామూహిక నిరాహార దీక్షలు నిర్వహించారు. నగర టిడిపి నాయకులు కోవెలమూడి నాని ,డేగల ప్రభాకర్, నిమ్మల శేషయ్య ఆధ్వర్యంలో గుంటూరు జయదేవ్ కార్యాలయంలో కార్యకర్తల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు దీక్షలో పాల్గొన్నారు. చంద్రబాబు పై రాజకీయ కక్ష సాధింపులో భాగంగా ఏడేళ్లక్రితం జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంపై ఇప్పుడు కేసులు నమోదు చేశారని కోవెలమూడి రవీంద్ర ఆరోపించారు. అవినీతి మచ్చలేని చంద్రబాబుపై లేనిపోని అభియోగాలు, అబాండాలు మోపారని ధ్వజమెత్తారు. జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి అక్రమ కేసులతో ప్రతిపక్ష నేతలను తీవ్ర ఇబ్బందులు పాలు చేస్తున్నాడని డేగల ప్రభాకర్ అన్నారు. చంద్రబాబు నాయుడు వస్తున్న ప్రజాదరణ చూసి, యువగళంతో నారా లోకేష్ ప్రజలు పడుతున్న హారతులు చూసి ఓర్వలేని జగన్ అక్రమ కేసులుపెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కార్పొరేటర్లు మానం పద్మశ్రీ ,భారతి ,బాలాజీ శ్రీరామ్ ప్రసాద్ (బుజ్జి),నాయకులు వజ్జా లక్ష్మి విజయలక్ష్మి ,అనిత ,వాణి ,మల్లికా , ముత్తినేని రాజేష్ ,గొల్ల ప్రభాకర్ ,మార్కండేయులు, మానంశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


నిరుపయోగంగా డంపింగ్ యార్డులు

ప్రజాశక్తి- ఫిరంగిపురం

సెప్టెంబర్ 10 న్యూస్. స్థానిక మండలంలోని బేతపూడి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక మురుగు నీరు ప్రవహించే కాలువలో ప్లాస్టిక్ డబ్బాలు వాటర్ బాటిల్ లు ప్లాస్టిక్ కవర్లు రాత్రిపూట మిగిలిన అన్నం కూరలు చెత్తాచెదారం కాలువలో పడవేయడం వలన స్కూల్లో చదివే విద్యార్థులు 450 మందికి ఉపాధ్యాయులకు చుట్టూ నివసించే స్థానిక ప్రజలకు దుర్గంధమైన వాసన వెదజల్లుతూ అనేక రోగాలతో ఇబ్బందులు పడుతున్నారు ఎనిమిదో



వార్డులో చెత్త సేకరించి వ్యక్తి వారంలో ఒకసారి వస్తారని సేకరించిన తడి పొడి చెత్త వేస్ట్ ను కాలువలో వాగులో పడవేస్తారని స్థానిక ప్రజలు తెలిపారు దీనివలన అనేక రోగాల బారిన పడి విష జ్వరాలతో బాధపడుతున్నామని స్థానిక ప్రజలు తెలిపారు సంబంధిత అధికారులు మాత్రం చూసి చూడనట్లు పట్టినట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక



ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుచున్నారు.

పల్నాడు జిల్లాలో 144 సెక్షన్ : ఎస్పీ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



పల్నాడు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని పల్నాడు ఎస్పీ వై. రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు పల్నాడు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎటువంటి నిరసనలకు, ధర్నాలకు, ర్యాలీలకు అనుమతి లేదని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

ఇదొక చీకటి రోజు : కోవెలమూడి రవీంద్ర



ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించటం ప్రజాస్వామ్యానికి చీకటి రోజని గుంటూరు పశ్చిమ నియోజక వర్గ టిడిపి ఇంచార్జి కోవెల మూడి రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం విజయవాడ కోర్టులో వాదనల అనంతరం అధినేత చంద్రబాబు నాయుడు ను కలిసిన ఆయన మాట్లాడుతూ రాజకీయ కుట్రలో భాగంగా చంద్రబాబును అరెస్ట్ చేసి జగన్ అండ్ కో పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారని కోవెలమూడి రవీంద్ర విమర్శించారు . . చంద్రబాబు అరెస్ట్‌తో వైసీపీకి కాలం చెల్లిందని వ్యాఖ్యానించారు. ఒక విజన్‌ను ఉన్న నాయకుడిగా చంద్రబాబుకు మంచి గుర్తింపు ఉందని ఓర్వలేకే ఆయన పేరు ప్రతిష్టలకు భంగం కల్పించాలనే ఏకైక లక్ష్యంతో వైసీపీ నాయకులు ఆయన ప్రతిష్ఠతకు మసి పూయాలన్న ఆలోచనతో అక్రమ అరెస్టుకు సిద్ధపడ్డారని ఆరోపించారు. స్కిల్ డెవలప్ మెంట్‌లో అవినీతి జరిగిందన్నది వైసిపి అబద్దపు ప్రచారం మాత్రమే అని కోవెలముడి రవీంద్ర (నానీ) తెలిపారు. చంద్రబాబు అరెస్ట్ ను నిరసిస్తూ రేపు రాష్ట్రవ్యాప్త బంద్ కు పిలుపినిస్తున్నా మని, ప్రజలు ఈ బంద్ కు సహకరించాలన్నారు.

జగన్ పైశాచికానందం : నశీర్ అహ్మద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నారా చంద్రబాబు నాయుడు అక్రమంగా అరెస్ట్ చేయటాన్ని ఖండిస్తూ గుంటూరు తూర్పు నియోజకవర్గం ఇంచార్జి మొహమ్మద్ నసీర్ ఆధ్వర్యంలో పాతబస్టాండ్ వద్ద ఆదివారం సామూహిక నిరాహార దీక్షలు నిర్వ హించారు.

చంద్రబాబు, లోకేష్‌కి వస్తున్న జనాదరణ చూసి ఓర్చుకోలేక లండన్ లో ఉన్న జగనరెడ్డి తన పోలీసులను అడ్డుపెట్టుకొని అరెస్ట్ చేయించి పైశాచిక ఆనందం పొందుతూన్నాడన్నారు. నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, కార్పొరేటర్లు సమత, భారతి, అశోక్ పాల్గొన్నారు.






క్షతగాత్రులను పరిక్షిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ఆటో బోల్తా - 11 మందికి గాయాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆటో బోల్తా పడిన ప్రమాదం లో 11 మంది గాయపడ్డారు. వీరిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. అమరావతి మండలం నెమలికల్లు సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. తాడేపల్లి మండలం కుంచనపల్లి నుంచి 11 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఆటో కంభంపాడు వెళ్ళుతుండగా మార్గమధ్యలో నెమలికల్లు వద్దకు చేరుకునేసరికి ప్రమాదావశాతు బోల్తా పడింది. ప్రమాదం లో గాయపడిన వారిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ క్యాజువాల్టి కి చేరుకున్నారు. క్షతగాత్రులకు స్వయం గా ఆయనే వైద్య సేవలు చేశారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆయన ఆదేశించారు.



ఉత్తమ ఉపాధ్యాయినికి సన్మానం

ప్రజాశక్తి - వినుకొండ

ఉపాధ్యాయ దినోత్సవం నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న శావల్యాపురం జడ్పీహెచ్ హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయురాలు తేళ్ళ నిర్మలా భాస్కర్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఇమ్మానియేల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన అభినందన సభలో సంఘ సభ్యులు తేళ్ల నిర్మల భాస్కర్ దంపతులన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారిని జిల్లా జడ్పీ కో ఆప్షన్ సభ్యులు గుండాల స్వెనోమ్. అభినందించారు. అనంతరం స్వెనోమ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని వినుకొండ జడ్పిహెచ్ బాలికల పాఠశాల, నిర్మల భాస్కర్ ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారని కొనియాడారు.



వీరభద్ర స్వామి ఆలయానికి పల్నాడు ఎస్పీ

ప్రజాశక్తి- గుంటూరు సిటీ

గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న వీరభద్ర స్వామి ఆలయం మహెూఉత్సవంలో పల్నాడు జిల్లా ఎస్పి రవి శంకర్ రెడ్డి కుటుంబ సభ్యులతోపాటు గుంటూరు జిల్లా అడిషనల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు వీర భద్ర స్వామి ఆశీస్సులు పోలీస్ డిపార్ట్మెంట్ లో పనిచేసే ప్రతి ఒక్కరికి వుండాలని,ఎస్పి రవి శంకర్ రెడ్డి కోరారు. అనంతరం మంగళా వాయిద్యాల మధ్య నడుమ ప్రత్యేక పూజ హెూమం నిర్వహించారు.



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న బొల్లు రాజేశ్వరి కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

బొల్లు రాజేశ్వరి కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతి ఏటా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందని ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ బొల్లు వెంకట కృష్ణారావు అన్నారు. ఈ మేరకు ట్రస్టు ద్వారా నకరికల్లు మండలం దేచవరం ఎపి మోడల్ స్కూల్ లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన విద్యార్థిని బొక్కిసం జయలక్ష్మికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట కృష్ణారావు మాట్లాడుతూ తమ ట్రస్ట్ స్థాపించిన దగ్గర నుండి పేద విద్యార్థులను ఆదుకుంటున్నట్లు చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఏ పేద విద్యార్థిని చదువుకు దూరం కాకూడదని అన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ బొల్లు వెంకటేశ్వర్లు, తుర్లపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వీల్‌చైర్లు, స్ట్రెచర్లను అందజేస్తున్న నవోదయ సైకిల్ షో రూమ్ యజమాని కటకం శేషగిరి

కటకం శేషగిరి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - మాచర్ల

ఎంతోమంది పేదలు వైద్య సహాయం పొందుతున్న ప్రభుత్వ వైద్యశాలకు రూ.50 వేల విలువ చేసే వీల్‌చైర్లను , స్ట్రెచర్లను నవోదయ సైకిల్ షో రూమ్ యజమాని కటకం శేషగిరి అందించడం అభినందనీయమని ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ రామకోటయ్య అన్నారు. ప్రభుత్వ వైద్యశాలకు రెండు వీల్ చైర్మను, రెండు స్ట్రెచర్లను విరాళంగా ఆదివారం జరిగిన ఆయన అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకోటయ్య మాట్లాడుతూ వైద్యశాలలో వీల్ చైర్లు , స్ట్రెచర్లు పాతబడి పాడైపోవడం వలన పేషెంట్లు ఎంతో ఇబ్బంది పడుతున్న తరుణంలో శేషగిరి సహాయంతో ఆ కొరత కొంతమేరకు తీరిందని అన్నారు. అనంతరం ఎంఇఒ వేముల నాగయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు దినేష్ రోటరీ క్లబ్ ప్రతినిధులు ఐ శంకర్,శ్రీనివాస రావు, హనీఫ్, వివేకానంద సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి, కూనిసెట్టి హర్షవర్ధన్, జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు కేలమ్ ఆదినారాయణ పాల్గొన్నారు

24 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి- రెంటచింతల

మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు 24 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు గణాంక అధికారి ఈశ్వర్ రెడ్డి తెలిపారు సెప్టెంబర్ నెలలో సాధారణ వర్షపాతం 136 మిల్లీమీటర్ల కాగా ఇప్పటికే 184 మిల్లీమీటర్ల వర్షం కురిసింది అన్నారు.

రైతుల్లేని రైతుబజారు!

- చిలకలూరిపేటలో రోడ్ల పక్కనే విక్రయాలు
- రైతుబజారులో ఖాళీగా ఉన్న 32 షాపులు
- ప్రోత్సాహకాలు కావాలంటున్న రైతులు, డ్వాక్రామహిళలు





ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేటలో రైతు బజార్ ఉన్నప్పటికీ అందులో కూరగాయలు, ఆకుకూరలు విక్రయించే రైతులే కరువయ్యారు. అదే విధంగా, డ్వాక్రా మహిళలు వారు తయారు చేసిన తినుబండారాలను, ఇతర ఉత్పత్తులు కూడా అందులో విక్రయించే పరిస్థితి లేదు. రోడ్ల పక్కన, ప్రధాన రహదారుల వెం బడి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వాటిని విక్ర యిస్తున్న పరిస్థితి చిలకలూరిపేటలో నెలకొంది. మధ్య వర్తులు, కమిషన్‌దారులు, దళారులు లేకుండా రైతులు, డ్వాక్రా మహిళలు వారి వస్తువులను వారే వినియోగదారులకు నేరుగా అమ్ముకునే



నిమిత్తం గత ప్రభుత్వం దాదాపు ఇరవై ఐదేళ్ల క్రితం ఈ రైతు బజార్లను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా చిలకలూరిపేటలోని ఎన్నార్టీ సెంటర్‌లో 48 షాపులతో రైతుబజార్ ఏర్పాటు చేసింది.ఈ 48 షాపుల్లో నాలుగింటిని ప్రయివేటు వ్యక్తులకు ఒక్కో షాపునకు నెలకు రూ.6 వేలు చొప్పున అద్దెకు యిచ్చారు. దీంతో పాటు కరెంట్ చార్జీల కింద రూ.500 వసూలు చేస్తున్నారు. ఇందులో పది షాపులలో మాత్రమే రైతులు విక్రయాలు సాగిస్తున్నారు. మిగిలిన షాపుల్లో ఒక దాంట్లో ఉల్లిపాయలు, మరో షాపులో బియ్యం విక్ర యిస్తున్నారు. మిగిలిన 32 షాపులు సుమారు రెండున్న రేళ్లుగా ఖాళీగా ఉంటున్నాయి.

రైతులు తమ పండించిన పంటలను రైతుబజారులో అమ్ముకోవాలంటే ఆయా గ్రామాలకు సంబంధించిన వీఆర్వోల ధ్రువీకరణ పత్రం ఉండాలనేది నిబంధన. పదిహేను రోజులకొకసారి వారు తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలి. ధ్రువీకరణపత్రాలు, రెన్యువల్ నిమిత్తం గ్రామ సచివాలయాల చుట్టూ తిరగలేకపోతున్నామని రైతులు అంటున్నారు. రైతులకు ఎటువంటి నిబంధనలు లేకుండా తాము పండించిన కూరగాయలు, ఆకుకూరలను రైత బజార్లలో అమ్ముకునే సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. డ్వాక్రా మహిళలకు ప్రోత్సాహకాలు లేకపోవడంతో పచ్చళ్ళు, కిరాణా, ఇతర వస్తువులను విక్రయించడం కష్టసాధ్యంగా మారిందని వారు చెబుతున్నారు. ఆయా కారణాల వల్లే సుమారు రెండున్నరేళ్లుగా 32 షాపులు ఖాళీగా ఉన్నాయని అంటున్నారు.

కూరగాయలను రైతుబజారులో కాకుండా బయట విక్రయిస్తుండటం వల్ల మున్సిపల్ కాంట్రాక్టర్లలు తమ వద్ద రోజుకి రూ.10 వసూలు చేస్తున్నారని రైతులు చెప్పారు. అసలే పెరిగిన రేట్లతో అమ్మకాలు అంతంత మాత్రంగా ఉన్నాయని, బ్యాటరీ విద్యుత్ బల్బుల చార్జీలు గతం లో రూ.20, రూ.25గా ఉంటే ప్రస్తు తం రూ. 100కు పెంచారని,ఒకొక్క షాపునకు 4 నుంచి 6 విద్యుత్ బల్బులు వాడాల్సి వస్తోందని చెబుతున్నారు. రైతుబజారులో సుమారు ఇరవై ఐదేళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న ఎస్టేట్ అధికారులను పర్మినెంట్ చేయకపోవడం, జీతాలు పెంచకపోవడం వంటి సమస్యలతో వారు ఇబ్బంది పడుతున్నారు. టమాటాలు, ఉల్లిపాయలు, అరటికాయలు మొదలైన వాటి ధరలు పెరిగినప్పుడు రైతు బజారులో తమతో గొడ్డు చాకిరి చేయిస్తున్నారని వారు చెబుతున్నారు.

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి-రెంటచింతల

బాల్య వివాహాలను నిర్మూలన మన అందరి బాధ్యతని ప్రముఖ న్యాయవాది ప్రభుదాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన రెంటచింతలలో కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాలబాట విజన్ 2020 -30 బాల్య వివాహాల నిర్మూలన బాలల హక్కులు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బాలబాట దళిత,పేద వర్గాల వారికి ఎంతో దోహద పడుతుందని చెప్పారు. కార్డ్స్ డైరెక్టర్ తాలూరి అమర్నాథ్, ఉపాధ్యాయుడు కె.వెంకయ్యలు మాట్లాడుతూ అక్షర శక్తి గొప్పదని, ప్రతి గ్రామంలో బాలబాట అభివృదికి కృషి చేయాలని అన్నారు కార్యక్రమంలో నందనాయక్, బాలబాట ఏ సి ఓ వేల్పుల రవి, డి సుధాకర్ పాల్గొన్నారు



'మిషన్ ఇంద్రధనస్సు'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.రవి

లక్ష్యం మేరకు వ్యాధి నిరోధక టీకాలు వేసి మిషన్ ఇంద్రధనస్సు విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.రవి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలో రెండవ విడత మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం నేటి నుండి 16వ తేదీ వరకు జరగనున్నట్టు చెప్పారు. ఇప్పటికే ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు వారి గ్రామంలో సర్వే నిర్వహించి, లబ్ధిదారులను గుర్తిం చారని అన్నారు. వారం దరికీ ఈ ఆరు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో అన్ని రకాల వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వ హించాలన్నారు. ఇప్పటి వరకు పల్నాడు జిల్లాలో 648 మంది గర్భిణులు, 2478 మంది 5 ఏళ్ళ లోపు పిల్లలను గుర్తించి నట్లు చెప్పారు. వీరందరికి మిషన్ ఇంద్రధనస్సు ద్వారా టీకాలు ఇచ్చి ప్రాణాంతక వ్యాధుల బారి నుండి కాపాడాలని సూచించారు.

'కన్వీనర్లు, గృహసారథులకు అండగా ఉంటాం'

ప్రజాశక్తి-నకరికల్లు



ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథ కాలు అందజేయాలనే లక్ష్యంతో వైసిపి ప్రభు త్వం పనిచేస్తోందని మండల జేసిఎస్ కన్వీనర్ మేడం ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. నకరికల్లు, చల్లగుండ్ల సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల ప్రమాద బీమా పథకం, రిజిస్ట్రేషన్‌పై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కన్వీ నర్లకు, గృహసారథిలకు తమ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అరవ.ఆదిలక్ష్మి నాగేశ్వరరావు, బైరెడ్డి సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్ బి భాష,శా గం చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీలు గోపు అంజిరెడ్డి జక్కిరెడ్డి కోటిరెడ్డి, వైఎస్ఆర్ సీపీ నాయకులు పమ్మి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి- సత్తెనపల్లి



స్థానిక వేద కళాశాలలో పట్టాలు అందుకుంటున్న విద్యార్థినీవిద్యార్థులు

గ్రాడ్యుయేషన్ డే సత్తెనపల్లి పట్టణంలో ఘనంగా జరిగింది . ఈ మేరకు స్టాఫ్ నర్స్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఆదివారం స్థానిక వేద కళాశాలలో పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య శాల నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ మాట్లాడుతూ నర్సింగ్ వత్తి ఎంతో పవిత్రమైందని పేర్కొన్నారు. సమాజంలో పేదలకు సేవ చేసే అదృష్టం నర్సింగ్ వృత్తిలో ఉంటుందన్నారు.ఓర్పు సహనం ఈ వత్తి ఎంతో అవసరమన్నారు. సత్తెనపల్లి ప్రాంత విద్యార్థులకు అందుబాటులో నర్సింగ్ పారా మెడికల్ కోర్సులు తీసుకువచ్చిన వేద విద్యాసంస్థలను ఆమె అభినందించారు. వైద్యశాల హెడ్ నర్స్ బంగారుపాప మాట్లాడుతూ నర్సింగ్ కోర్సు పార్టీ చేసిన వారికి ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. విదేశాలలో బాగా డిమాండ్ ఉన్న కోర్స్ నర్సింగ్ అన్నారు. ఇంటర్ వొకేషనల్ నర్సింగ్ ద్వితీయ సంవత్సర విద్యార్థినులకు నర్సింగ్ క్యాప్‌లు అందించి ప్రమాణం చేయించారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో శిక్షణకు వస్తున్న విద్యార్థుల వలన పేద రోగులకు మరింత సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ తమ కళాశాల నుండి కేవలం గత రెండు సంవత్సరాల కాలంలో మూడు వందల మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారన్నారు. అనంతరం కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల బాధ్యులు ఇ.సరిత. కె.ప్రభావతి, ఐ.నాగలక్ష్మి, సైదా నాయక్, నాగరాజు, రవికుమార్, అడ్మిన్ డైరెక్టర్ చింతాడ ప్రభావతి పాల్గొన్నారు.

47 వసంతాల వర్సిటీ

- నేడు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం
- 22 మందికి ప్రతిభా పురస్కారాల ప్రదానం



వర్సిటీ ప్రధాన ద్వారం


వర్సిటీ లోగో

ప్రజాశక్తి - ఎఎన్‌యు

బోధన , పరిశోధన, క్రీడా, సాంస్కృతిక, మౌలిక సదుపాయాలు కల్పన వంటి విషయాల్లో అంచలంచెలుగా ఎదుగుతున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేగంగా అభివృద్ధి చెందుతున్న వర్సిటీగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. 1976లో ఆంధ్ర యూనివర్సిటీ నుంచి పీజీ సెంటర్‌గా ఏర్పడిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తొలుత 10 కోర్సులతో ప్రారంభమై నేడు సుమారు 70 కోర్సులను అందిస్తోంది. గ్రామీణ విశ్వవిద్యాలయంగా ఏర్పడి గ్లోబల్ స్థాయికి ఎదిగేందుకు ప్రయత్నిస్తోంది.

నూతన కోర్సులు

అనేక ఉపాధి కోర్సులను ప్రవేశపెట్టడంతోపాటు ఆరు కళాశాలలుగా రూపాంతరం చెందింది. ఆర్ట్స్, కామర్స్, న్యాయ శాస్త్ర కోర్సులకు, సైన్స్ కోర్సులకు, వ్యాయామ విద్య కోర్సులకు, ఫార్మసీ విద్యకు, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీకి, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్‌కు వేర్వేరు కళాశాలలు ఏర్పాటు చేసింది. అనేక నూతన కోర్సులు ప్రవేశపెట్టడంతోపాటు మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా ఎంబీఏ మీడియా మేనేజ్మెంట్, ఎంఎస్సీ ఫారెస్ట్రీ, ఎంఏ మ్యూజిక్, ఎమ్మెస్సీ డేటా సైన్స్, ఎంఎస్సీ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పొల్యూషన్ కంట్రోల్, ఎంటెక్ ఇరిగేషన్ వాటర్ రిసోర్సెస్ ఇంజినీరింగ్, బ్యాచిలర్ ఆఫ్ మల్టీమీడియా అండ్ యానిమేషన్, టీవీ అండ్ ఫిల్మ్, థియేటర్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డిజైన్, బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ప్లానింగ్ వంటి కోర్సులను ప్రారంభించింది.

పెరుగుతున్న పరిశోధనలు

వర్సిటీలో పరిశోధకుల సంఖ్య కొన్నేళ్లుగా గణనీయంగా పెరుగుతోంది. పరిశోధనలో ముఖ్యంగా పేటెంట్ హక్కులు సాధించడంలో జాతీయస్థాయిలో మూడవ స్థానాన్ని కైవసం చేసుకోవడం గమనార్హం. ఆంధ్ర యూనివర్సిటీ, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీల తరువాత ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేగంగా అభివృద్ధి చెందుతున్న వర్సిటీగా గుర్తింపు పొందింది. ఇక్కడ ఇంజినీరింగ్ కళాశాలలో శాటిలైట్ రీసెర్చ్ ప్రాజెక్టు, ఇస్రో ప్రాజెక్టులు చేశారు. 3డి ల్యాబ్, ఇంక్యుబేషన్ సెంటర్, ఆన్‌లైన్ ఎగ్జామ్స్ సెంటర్, ఏర్పాటు విద్యార్థులకు నూతన స్కిల్స్‌ను పెంపొందించడానికి దోహదపడుతున్నాయి.

గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యం : వీసీ



వర్సిటీ విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దేందుకు వర్సిటీ ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తోందని వీసీ పి.రాజశేఖర్ అన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసి విద్యార్థులను అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బోధన, పరిశోధనతో పాటు సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫార్మసీ, క్రీడా రంగాల్లో ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలోనే అధ్యాపకులకు ఒక్కొక్కరికి రూ.రెండు లక్షల చొప్పున సీడ్మని అందించి నూతన ప్రాజెక్టుల రూపకల్పనకు శ్రీకారం చుట్టామన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా రీడింగ్ రూములు, లైబ్రరీ సదుపాయం, నిత్యం ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించామన్నారు. సివిల్ సర్వీసెస్, గ్రూప్స్, యూజీసీ, ఏపీపీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణనిస్తున్నామని తెలిపారు.

ర్యాంకుల్లోనూ ముందజ

నాలుగేళ్లుగా సాధిస్తున్న ర్యాంకులు వర్సిటీ ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్నాయి. దాదాపు 160 వరకు జాతీయ అంతర్జాతీయ ర్యాంకులు సాధించింది. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్, ఇండియా టుడే, ఎన్ ఐ ఆర్ ఎఫ్, గ్రీన్ మెట్రిక్ ర్యాంక్, ఇంపాక్ట్ ర్యాంకింగ్, వరల్డ్ ర్యాంకింగ్, క్యూ ఎస్ఐ గేజ్, ఈ లీడ్ ర్యాంకింగ్, గ్రీన్ యూనివర్సిటీ అవార్డులను పొంది రాష్ట్రంలో మొదటి రెండు స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నిర్వహించిన మెగా జాబు మేళాలో 15 వేల మంది వరకు ఉద్యోగాలు సాధించారు. వర్సిటీ ప్రత్యేకంగానూ జాబ్‌మేళా నిర్వహించింది.

అంతర్జాతీయ స్థాయి విద్యార్థులను ఆకర్షించడం

వర్సిటీలోని అంతర్జాతీయ విద్యార్థి కేంద్రంలో విదేశీ విద్యార్థులను ఆహ్వానించేందుకు ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెల్ ద్వారా శ్రీలంక, బంగ్లాదేశ్, వియత్నాం, మయన్మార్, భూటాన్, నేపాల్, ఇరాన్ వంటి పలు దేశాల విద్యార్థులను ఆహ్వానించి వారి కోసం ప్రత్యేక వసతి గృహాన్నీ ఏర్పాటు చేశారు.

రెండేళ్ల వేడుకలు నేడు

వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకొని సోమవారం 46వ, 47వ వసంతాల వ్యవస్థాపక దినోత్సవాలను నిర్వహించేందుకు వర్సిటీ ముస్తాబైంది. మధ్యాహ్నం 2.30 గంటలకు డైక్‌మన్ ఆడిటోరియంలో వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో నిష్ణాతులైన వారికి ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. ఇందుకుగాను ఏడాదికి 11 మంది చొప్పున రేండేళ్లకు సంబంధించి 22 మందిని ఎంపిక చేశారు. విసి ప్రొఫెసర్ పి.రాజశేఖర్ అధ్యక్షతన జరిగే వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యవహారాల ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హాజరుకానున్నారు. మాజీ వీసీ ప్రొఫెసర్ వి.బాలమోహన్ దాస్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొననున్నారు.

ప్రతిభా పురస్కార గ్రహీతలు వీరే

డాక్టర్ జయప్రద రామమూర్తి (శాస్త్రీయ సంగీతం), డాక్టర్ ఎం.గిరిజ శంకర్ (ప్రజాసేవ), గద్దె మంగయ్య (విద్యా మరియు దాతత్వ రంగం), దాసరి రామకృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం), డాక్టర్ భవనం హనుమ శ్రీనివాస్‌రెడ్డి (వైద్య- సేవ రంగం), కిరణ్ మాకినేని (వైద్య -సేవా రంగం), నడింపల్లి హనుమంతరావు (కళా రంగం), మాస్టార్జీ (సామాజిక కళా సేవా రంగం), డాక్టర్ కోయి కోటేశ్వరరావు (సాహిత్య రంగం), అసిరయ్య (జానపద కళా రంగం), డాక్టర్ సిస్టర్ రోసలీన (సేవారంగం).

సమస్యకు ప్రాణమే పరిష్కారం కాదు..

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

చిన్న చిన్న సమస్యలను ఎంతో పెద్దవిగా ఊహించుకొని జీవితాన్ని అర్ధాంతరంగా ముగించడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదని ఎస్టీయు జిల్లా మాజీ అధ్యక్షులు గేరా మోహనరావు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మోహన రావు మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న ఆత్మహత్యలను నిలువరించేందుకు ప్రతి ఏటా సెప్టెంబర్ 10 వ తేదీన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆత్మహత్య ఆలోచనలు వచ్చినప్పుడు తన కుటుంబం గురించి ఆలోచించాలని, తమపై ఆధారపడిన వారు ఎలా ప్రభావితం అవుతారో ఆలోచించాలని అన్నారు. మనసు బాగాలేకుంటే కుటుంబం, పిల్లలు, స్నేహితులతో గడిపిన మధుర క్షణాలను గుర్తు తెచ్చుకోవాలని, కాలమే సమస్యలన్నిటికీ పరిష్కారం చూపుతుందనే నమ్మకాన్ని కలిగి ఉండాలని సూచించారు. సమస్యల నుండి బయట పడేందుకు పలుమార్గాలు ఉన్నాయని, సమస్యల పరిష్కారానికి ఆత్మహత్యలు పరిష్కారం కాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు పి.సుభాషిణి, జి.వెంకటేశ్వర్లు, కె.మంజుల, ఎ.సురేష్, కె.రాజబాబు పాల్గొన్నారు.

మనువాద భావజాలానికి వ్యతిరేకంగా కళారూపాలు

ప్రజాశక్తి-తాడేపల్లి


సమావేశంలో నాయకులు

బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న మనువాద భావజాలానికి వ్యతిరేకంగా కళారూపాలు తయారు చేసి ప్రజల్ని చైతన్యవంతం చేయాలని ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్ అన్నారు. ప్రజానాట్య మండలి గుంటూరు జిల్లా సమావేశం తాడేపల్లిలోని పిఎన్‌ఎం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షులు ఎస్.పద్మ అధ్యక్షత వహించారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ మనువాద సిద్ధాంతాన్ని తీసుకొచ్చి దేశాన్ని వేల సంవత్సరాలు వెనక్కి నెడుతున్నారని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ తీరును విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు, ఆస్తి పన్ను, చెత్త పన్ను, పట్టణ సంస్కరణలను వ్యతిరేకిస్తూ గేయాలు రూపొందించాలని కళాకారులను కోరారు. ఈ సందర్భంగా కమిటీ తీసుకున్న నిర్ణయాలను పిఎన్‌ఎం జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాస్ తెలిపారు. అక్టోబర్ 4 నుంచి 8 వరకు వడ్డేశ్వరంలో జరిగే రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరానికి గుంటూరు, మంగళగిరి నుంచి రెండు టీమ్‌లు పాల్గొనే విధంగా చూడాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర రాజకీయ బస్సు జాతా అక్టోబర్ 20 నుంచి నవంబర్ 2 వరకు జిల్లాలో తిరిగే సందర్భంగా వివిధ రకాల కళా ప్రదర్శనలు ఇవ్వాలని నిర్ణయించారు. నవంబర్ 7వ తేదీ విజయవాడలో జరిగే భారీ బహిరంగ సభలో కోలాటాలు, డప్పులు, జానపద నృత్యాలతో ప్రదర్శన నిర్వహించాలని తీర్మానించినట్లు చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి, నాయకులు నాయకులు ఎం.రవి, ఆర్‌వి రాఘవయ్య, పి.ప్రసాద్, రాజ్యలక్ష్మి, ఎం.శ్రీను పాల్గొన్నారు.



కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి - తుళ్లూరు

విజయవాడ నుంచి అమరావతి వెళుతున్న ఆర్టీసి బస్సు ఆదివారం గుంతలో కూరుకుపోయింది. తుళ్లూరు - దొండపాడు మధ్య టిడ్కో గృహ సముదాయాల సమీపంలో ప్రధాన రహదారిపై గుంత ఏర్పడింది. గుంతలో బస్సు వెనుక చక్రం దిగబడి పోవడంతో ప్రయాణికులు దిగి నెట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. గుంత వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు మండిపడుతున్నారు.



చెస్ పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన సిక్స్ సిగ్మా చెస్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక నందుల పేట కవిరాజాపార్క్ సమావేశ మందిరంలో ఆదివారం చెస్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా ఆమంచి నాగ సాయిదివ్య, కొత్త లక్ష్మి, హర్షిత్, ఎ.తన్మయి, సాదిక, దీపిక, దినేష్ రెడ్డి, సూర్యనారాయణ, శశాంక్ మౌళి, ప్రభంజన్ నిలిచినట్లు అకాడమీ డైరెక్టర్ ఎం నిరంజన్ తెలిపారు. వీరికి జిల్లా చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవీంద్రరాజు పతకాలు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు.

కుట్టు శిక్షణపై మైకు ప్రచారం

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని మేకా అమరారెడ్డిభవన్‌లో ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు నిర్వహించే కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని విజయవంతం చేయాలని పట్టణంలో మైకు ప్రచారం నిర్వహించారు. మహిళా నైపుణ్య శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో జరిగే కుట్టుమిషన్ శిక్షణ ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ఉంటుందని తెలిపారు.

వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

పట్టణంలోని రామనాథం చిన్నకోటయ్య శివపార్వతి వృద్ధుల సేవ ఆశ్రమంలో ఆదివారం 50 మందికి కళ్లజోళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షులు ఆర్.వెంకటేశ్వరావు, డీఎస్పీ మహబూబ్ బాషా, ఎ.శంకర్రావు, డి.సాంబశివరావు, పి.లక్ష్మీ కవిత, మంజులాదేవి పాల్గొన్నారు.





ఉత్తమ ఉద్యోగులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - వినుకొండ

ఇటీవల పల్నాడు జిల్లా కలెకర్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగస్తులుగా అవార్డులు అందుకున్న దార సంగీత రావు, మల్లబత్తిని ప్రకాష్ రావులను ఆదివారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని మాల మహానాడు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారిని మాలమహానాడు వినుకొండ కమిటీ సన్మానించింది. ఈ సందర్భంగా మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షులు కీర్తిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వారిని సత్కరించటం ఆత్మగౌరవానికి ప్రతీకనీ, రానున్న రోజుల్లో జాతి పక్షాన కమిటీ ఎప్పుడు అండదండగా ఉంటుందని అన్నారు. సంగీతరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వత్తిలో ఉంటూ ఎంతోమంది ఎస్సీ ,ఎస్టీ, బీసీ విద్యార్థులను ఉత్తీర్ణులుగా తీర్చిదిద్దటం ఆనందంగా ఉందని చెప్పారు. అనంతరం ఫారెస్ట్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న ప్రకాష్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో మాల మహానాడు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కొండ్రు విజయ్, గౌరవాధ్యక్షులు దార్ల ఎర్రయ్య, ప్రధాన కార్యదర్శి కొమ్మతోటి కపయ్య, వర్కింగ్ అధ్యక్షులు గుడిపూడి ఏసు రత్నం, పట్టణ అధ్యక్షులు బేతం దేవానంద్, ఉపాధ్యక్షులు జ్యోతి మల్లికార్జున్, పట్టణ కార్యదర్శి బేతం బాలకృష్ణ, వినుకొండ మండల కార్యదర్శి పి. రాజా, పి.రమేష్ పాల్గొన్నారు..

ఘనంగా బోనాల ప్రదర్శన

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలో వడియ రాజుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వినుకొండలో అంకాలమ్మ బోనాల ప్రద´ర్శన జాతర ఘనంగా నిర్వహించారు. వినుకొండ ఇందిరా నగర్ కు చెందిన వాడియరాజుల సంఘం తరుపు 3వ అవార్డు కౌన్సిలర్ దేవుళ్ళ అంజమ్మ, ప్రసాద్ కుమార్ మహిళలు కలసి బోనాల జాతర చేసుకుంటూ ఏనుగుపాలెం రోడ్ లోని అంకాలమ్మ గుడి వద్దకు చేరుకున్నారు.



కలెక్టర్ హామీతో దీక్ష విరమణ

ప్రజాశక్తి-నకరికల్లు

ఎమ్మెల్యే అంబటి రాంబాబు నాడు ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదంటూ నకరికల్లు జనసేన మండల అధ్యక్షురాలు తాడువాయి లక్ష్మి గత నాలుగు రోజులుగా చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను ఆ పార్టీ నాయకులు ఆదివారం విరమింపజేశారు. నకరికల్లులోని హుస్సేన్ హాస్పిటల్ వద్ద నుండి శివాపురం తండాకు వెళ్లే మార్గంలో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపడతానని అంబటి రాంబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని అన్నారు. తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన జిల్లా కలెక్టర్ ఎల్.శివ శంకర్‌ను కలిసిన జనసేన నాయకులు రోడ్డు సమస్యపై వినతిపత్రం అంద జేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ 15 రోజుల్లోగా సమస్యను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం జనసేన నాయకులు లక్ష్మీకి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు బి.అప్పారావు, కృష్ణా జిల్లా మహిళా వింగ్ కోఆర్డినేటర్ పార్వతీనాయుడు, రాజుపాలెం మండల అధ్యక్షుడు టి.నరసయ్య, మండల ఉపాధ్యక్షుడు షేక్ రఫీ, సత్తెనపల్లి కార్పొరేటర్ ఆర్.సుమన్ పాల్గొన్నారు.

సనాతన ధర్మం కాదు సమానత్వం కావాలి

చర్చాగోష్టిలో దళిత, ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



ప్రస్తుత భారతదేశానికి కావలసింది సనాతన ధర్మం కాదని సమానత్వం కావాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నరసరావుపేట పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన చర్చా గోష్టిలో దళిత ప్రజా సంఘాల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కుల వివక్ష పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ తమిళనాడు ముఖ్యమంత్రి తనయుడు ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలపై బిజెవి, ఆర్ఎస్ఎస్ మూకలు సనాతన ధర్మాన్ని సమర్థిస్తూ పెద్ద ఎత్తున చర్చ చేస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టా మన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ సనాతన ధర్మం భారతదేశంలో కుల వ్యవస్థను నిర్మించిందని, దళిత ,గిరిజన, బలహీన వర్గాలు, మహిళలకు ఎటువంటి హక్కులు లేకుండా చేసిందని విమర్శించారు. బ్రాహ్మణులు తప్ప మిగతా వారు ఎవరు చదువుకోకూడదని,ఆస్తి లేకుండా హీనమైన వృత్తులు మాత్రమే చేస్తూ, పైవారికి సేవలు చేస్తూ బతకాలనే భావజాలాన్ని ప్రజల మెదళ్లకు ఎక్కించిందని విమర్శించారు. సనాతన ధర్మాన్ని ప్రాచీన కాలం నుండి వివిధ కాలాలలో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ అనేక ఉద్యమాలు చేశారని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సనాతన ధర్మానికి ప్రామాణికమైన మనుధర్మ శాస్త్రాన్ని తగలబెట్టి తీవ్రంగా వ్యతిరేకించటం జరిగిందని తెలిపారు. మనుధర్మ శాస్త్రం ఎవరికైతే హక్కులు లేకుండా చేసిందో వారికి అంబేద్కర్ రాజ్యాంగంలో హక్కులు కల్పించారని అన్నారు.

ప్రజలందరూ సమానమే అని సూక్తికరించి సమానత్వం సాధించడానికి పాలకులు ఏమి చేయాలో రాజ్యాంగం లో పొందుపరిచారని చెప్పారు. అటువంటి రాజ్యాంగాన్ని నాశనం చేయటానికి ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని బిజెపి మూకలు కుట్రపన్నుతూ ప్రజల్లో భావావేశాలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తోందని విమర్శించారు. ఆర్ఎస్ఎస్,బిజెపి మూకల కుట్రలో పడిన రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులు, తమిళనాడు రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ పై అవాకులు చవాకులు పేలుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ఆర్ఎస్ఎస్ ,బిజెపి మూకల విషపు కౌగిలి నుండి ప్రజానీకాన్ని కాపాడటం కోసం, ప్రజలను చైతన్య పరచడం కోసం ప్రజాస్వామిక వాదులు, అభ్యుదయవాదులు కలిసి నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

చర్చా గోష్టిలో జై భీమ్ భారత్ పార్టీ జిల్లా సమన్వయకర్త గోదా జాన్ పాల్, దళిత గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా కన్వీనర్ మల్లెల చిన్నప్ప, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై రాధాకష్ణ,విసికె పార్టీ జిల్లా అధ్యక్షులు సూరె వీరయ్య, రైతు సంఘం నాయకులు ఏపూరి గోపాలరావు, కౌలురైతు సంఘం నాయకులు కామినేని రామారావు, కోండ్రు ఆంజనేయులు, సిఐటియు నాయకులు షేక్ సిలార్, ఆవాజ్ నాయకులు షేక్ మస్తాన్ వలి, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) జిల్లా నాయకులు మేడం ఆంజనేయులు,మాల మహానాడు నరసరావుపేట యూత్ నాయకులు చావా సామేలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి శ్రేణుల నిరాహార దీక్షలు


ప్రజాశక్తి - పల్నాడు,గుంటూరు జిల్లాల విలేకరులు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్ట్ అప్రజాస్వామికమని టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఈ మేరకు గుంటూరు రోడ్డులోని టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలతో కలిసి సామూహిక నిరాహారదీక్ష చేపట్టారు. కోర్టు తీర్పు అనంతరం నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా టిడిపి జిల్లా కార్యాలయం వద్ద అదేవిధంగా గుంటూరు రోడ్డులోని నియోజకవర్గ కార్యాలయం వద్ద భారీగా పోలీసులు మోహరించారు. నరసరావుపేట డిఎస్పీ కెవి మహేష్ ఆదేశాల మేరకు పట్టణంలో 144 సెక్షన్ విధించారు. **వినుకొండ:** టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షులు ముక్తాఫ్ అహ్మద్ ఆధ్వర్యంలో స్థానిక శివయ్య స్తూపం సెంటర్లో సామూహిక నిరాహార దీక్షలను ప్రారంభించారు. **బెల్లంకొండ:** మండల కేంద్రం బెల్లంకొండలో టిడిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలను అణిచి వేయాలనే ఉద్దేశంతో, కక్షపూరితంగా ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర ప్రభు త్వం పెట్టిన కేసులన్నీ తప్పుడు కేసులని డిమాండ్ చేశారు. **పెదకూరపాడు:** స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పెదకూరపాడు మండల టిడిపి అధ్యక్షులు రమేష్ మాట్లాడారు. **సత్తెనపల్లి టౌన్:** స్థానిక ఆర్టీసి బస్టాండ్ వద్ద నిరసన దీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ ఎలినెడి రామస్వామి మాట్లాడుతూ చంద్రబాబును అరెస్టు చేయడం వైసిపి రాక్షస పాలనకు నిదర్శనమని అన్నారు. **సత్తెనపల్లి రూరల్:** పట్టణంలో ని ఆర్టీసీ బస్టాండ్ వద్ద టిడిపి నాయకులు రోడ్డు పై బైఠాయించి ఆదివారం రాత్రి రాస్తారోకో చేశారు. వ ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. సత్తెనపల్లి డిఎస్పీ బి ఆదినారాయణ ఆధ్వర్యంలో పట్టణ సిఐ యు శోభన్ బాబు వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. **ముప్పాళ్ల:** ఇరుకుపాలెంలో ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు నివాసంలో చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. **రెంటచింతల:** చంద్రబాబు నాయుడు ని అరెస్టు చేసిన విధానాన్ని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ పార్టీలు



నరసరావుపేటలో సామూహిక నిరాహారదీక్ష

తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గడిపర్తి శ్రీనివాసరావు తెలిపారు.**మాచర్ల:** తెలుగు దేశం పార్టీ శాఖ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్ష జరిగింది. దీక్షా శిబిరంలో పట్టణ టిడిపి అధ్యక్షులు కొమర దుర్గారావు, టిడిపి నాయకులు రవి కుమార్, గుండాల శ్రీను, నేరేటి వీరస్వామి, మంజుల, అంజి పాల్గొన్నారు. **తుళ్లూరు:** రాజధాని గ్రామాల్లోని రైతు దీక్షా శిబిరాలలో రైతులు, మహిళలు సామూహిక నిరాహారదీక్షలు చేపట్టారు. అమరావతి జెఎసి పిలుపు మేరకు తుళ్లూరు, ఉద్దండరాయునిపాలెం శిబిరాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దీక్షలు కొనసాగాయి. మందడం దీక్షా శిబిరం ముందు రోడ్డుపై నిరసన తెలిపారు. **తెనాలి:** స్థానిక మార్కెట్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని మహ్మద్ ఖుద్దూస్ ప్రారంభించారు. **పెదకాకాని రూరల్:** పెదకాకాని సెంటర్లోని బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నాయకుల ఆధ్వర్యంలో సామూహిక నిరాహార దీక్ష నిర్వహించారు. **పెదనందిపాడు రూరల్:** మండలంలోని అబ్బినేని గుంట పాలెం ప్రధాన రహదారి పక్కన ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు నాయుడు అరెస్టుకు కోర్టు తీర్పుకు నిరసన వ్యక్తం చేస్తూ ఆదివారం రాత్రి తెలుగుదేశం నాయకులు అభిమానులు నిరసన ప్రదర్శన నిర్వహించారు.



ఉద్దండరాయునిపాలెంలో సామూహిక నిరాహారదీక్షలు

నరసరావుపేటలో వైసిపి సంబరాలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నారా చంద్రబాబు నాయుడు రిమాండ్ విధించడంతో వైసిపి నేతల సంబరాలు చేసుకున్నారు. నరసరావుపేట మండలం రంగారెడ్డిపాలెం గ్రామంలోని వైసిపి శ్రేణులు టపాసులు పేల్చారు. స్కిల్ డెవలప్మెంట్ స్కాం లో చంద్రబాబు నాయుడు కి ఏపీ సీఐడీ కోర్టు 14 రోజులు రిమాండ్ విధించి ఇచ్చిన తీర్పు పట్ల వైసిపి నేతలు హర్షం వ్యక్తం చేశారు.



ఆత్మ హత్య నివారణ దినోత్సవం

ప్రజాశక్తి - వినుకొండ

ఆత్మ హత్య నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని విశ్వ సాయి జూనియర్ కళాశాలలో ఆదివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆవేశాలకు లోనై బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని, కుటుంబం గురించి, పొందబోయే అద్భుతమైన జీవితం గురించి ఆలోచించాలని స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెక్రటరీ నాగాంజనేయులు, వినుకొండ బీఈడీ కళాశాల డైరెక్టర్ గాలి శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. క్షణిక ఆవేశాలకు లోనై అందమైన జీవితాన్ని పాడు చేసుకోవద్దని, చిన్న వయసులో ఓటమిని పొందిన వాడే గొప్ప విజేతగా నిలుస్తాడని అన్నారు. ఎందరో మహానుభావులు ఇలాగే ఆదర్శవంతులుగా మారారని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులు జీవన లక్ష్యం సాధించేందుకు ఎంతో తోడ్పాటు అందిస్తాయని విద్యార్థులు సంస్కారవంతమైన విద్యను అభ్యసిస్తూ అందరికీ ఆదర్శవంతులుగా మీరు మారాలని కళాశాల డైరెక్టర్ తెలియజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాస శర్మ, ప్రిన్సిపాల్ శ్రీవల్లి పావని, కళాశాల ఇతర అధ్యాపకుల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
సోమవారం 11 సెప్టెంబర్ 2023

పరస సత్యనారాయణ శతజయంతి ఉత్సవాలు జయప్రదం చేయండి

సిఐటియు పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

కార్మికోద్యమ నేత పరస సత్యనారాయణ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి పిలుపునిచ్చారు. ఆదివారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన సిఐటియు జిల్లా కమిటీ విస్తృత సమావేశంలో నేతాజి మాట్లాడారు. సత్యనారాయణ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లో రక్తదాన శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, కార్మిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరస సత్యనారాయణ గుంటూరు జిల్లాలో జన్మించి, ఎస్-



సమావేశంలో మాట్లాడుతున్న నేతాజి

ఎల్‌ఎసి పూర్తి చేసి, సింగరేణి కేలరీస్ ఉద్యోగంలో చేరి, అక్కడి నుండి కార్మిక నాయకుడిగా అంచలంచెలుగా ఎదిగి కార్మిక సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుదీర్ఘకాలం రాష్ట్ర అధ్యక్షులుగా, ఎమ్మెల్యేగా పనిచేశారని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని జరిగిన ఉద్యమంలో రాజీనామా చేసిన ఎమ్మెల్యేలలో పరస సత్యనారాయణ ఒకరని తెలిపారు. ప్రజల కోసం కార్మికుల కోసం అనేక త్యాగాలు చేశారని, చివరి శ్వాస వరకూ కార్మిక ఉద్యమాన్ని ముందుకు నడించటానికి కృషి చేసిన ధన్యజీవి అని అన్నారు. సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా జిల్లా నాయకులు ముత్యాలరావు, కె.శ్రీనివాసరావు, దుర్గారావు, లక్ష్మణరావు, హుస్సేన్‌వలి, శివాజీ, భాగ్యరాజు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్యామ్ ప్రసాద్

వి కార్డియాక్ వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-తెనాలి

మండలంలోని అంగలకుదురులో తెనాలి పట్టణానికి చెందిన వి కార్డియార్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిభిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని గోవాడ తులశమ్మ పరంధామయ్య కళ్యాణమండపంలో నిర్వహించిన శిబిరంలో ఇసిసి, షుగర్, బిపి, బిఎమ్‌డి, థైరాయిడ్ వంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండె సంబంధిత వ్యాధులకు వైద్యశాల అధినేత, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్, గైనకాలజీకి సంబంధించి డాక్టర్ విజయవాణి, చిన్న పిల్లలకు పీడియాట్రిస్ట్ డాక్టర్ కె,సురేష్, ఎముకలు-కీళ్ల వ్యాధులకు డాక్టర్ షేక్ తాజుద్దీన్ వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ కె.సాంబశివరావు మాట్లాడుతూ వి కార్డియాక్ మల్టిస్పెషాలిటీ వైద్యశాల్లో అన్ని విభాగాల్లో అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఉదయనిధి వ్యాఖ్యలు సమర్థనీయమే



ఉదయనిధికి సంఘీభావ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని, అప్పుడే సమాజం అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందని తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ మాట్లాడిన మాటలను సమర్థిస్తున్నట్లు దళిత, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఉదయనిధికి మద్దతుగా ఆదివారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ అధ్యక్షత వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా, అసమానతలు తగ్గేలా దేశాన్ని నడిపించటం ప్రభుత్వ బాధ్యతన్నారు. కానీ అందుకు భిన్నంగా పాలకులు మనువాదాన్ని ఆచరిస్తూ దేశం తిరోగమనానికి కారణం అవుతున్నారని విమర్శించారు. 85 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, మహిళలను అనేక రూపాల్లో వేధింపులకు గురి చేస్తున్న మనువాదాన్ని సనాతన ధర్మం బలపరుస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు సమర్థనీయం అన్నారు. ఉదయనిధి తలకు రూ.10 కోట్లు సుపారీ ప్రకటించటం రాజ్యాంగ విరుద్ధమని, స్వామీజిని వెంటనే ఆరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇండియన్ లేబర్ పార్టీ జాతీయ అధ్యక్షులు మద్దు అంకయ్య, ముస్లిమ్ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కె.ఖాజావలి, దళిత మహాసభ నాయకులు కొండపల్లి విల్సన్, న్యాయవాది గంగోలు శామ్యూల్, బీమ్ సేన సేవాదళ్ అధ్యక్షులు ఎన్.నీలాంబరం, బిసి బహుజన ఫ్రంట్ అధ్యక్షులు టి.నరసింహారావు మాట్లాడగా సిహెచ్.సాంబయ్య, ఆదినారాయణ, జె.మోహన్, రాజేంద్ర ప్రసాద్, ఎ.సుజాతరావు, ఎన్.బ్రహ్మయ్య పాల్గొన్నారు.



150 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-గుంటూరు

బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించటం అభినందించతగ్గ విషయమని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అన్నారు. ఆదివారం నగరంలోని బ్రాడీపేటలో బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యార్థులకు నగదు బహుమతి పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మేయర్ పాల్గొని 150 మందికి పారితోషికాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ ఆర్థిక ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మరికొంత మంది విద్యార్థులకు సహాయం అందించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షులు రంగా వఝుల లక్ష్మిపతి, కార్యదర్శి తాళ్ళూరి ప్రకాష్, కోశాధికారి కర్లపాలెం బాలకృష్ణ, సంజీవరావు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆరోగ్య సభలో జిజిహెచ్ విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి



మాట్లాడుతున్న డాక్టర్ ప్రభావతి

ప్రజాశక్తి-గుంటూరు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, మంచి ఆహారం తీసుకుంటే సీజనల్ వ్యాధుల నుండి కాపాడుకోవచ్చని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్యసభలో సీజనల్ వ్యాధులపై డాక్టర్ ప్రభావతి మాట్లాడారు. వర్షాకాలంలో ఎక్కువగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ, ఆయాసం, ఆస్తమా, అలర్జీ, జలుబు, దగ్గు, జ్వరం, విరేచనాలు, వాంతులు లాంటి సమస్యలు వస్తుంటాయని అన్నారు. ఇవి ముఖ్యంగా నీరు, గాలి కలుషితం అవటం వల్ల వస్తాయన్నారు. మనం నివసించే పరిసరాలను నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకూ కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. ఆహారంలో మొలకలు, మిల్లెట్లు, డ్రైఫ్రూట్స్ తీసుకోవాలని తెలిపారు. స్త్రీలు కుటుంబాల్లో ముఖ్యపాత్ర పోషిస్తారని, వారి ఆరోగ్యం పక్కనబెట్టి కుటుంబ బాధ్యతలు నిర్వహణలో మునిగిపోతున్నారని అన్నారు. స్త్రీలు కుటుంబ విషయాలపైనే కాకుండా తమ ఆరోగ్యం విషయంలోనూ కొంత శ్రద్ధ వహించాలని సూచించారు. స్త్రీలలో ముఖ్యంగా సర్వైకల్ కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్‌లు వస్తాయన్నారు. షుగర్ వ్యాధి చాలా ప్రమాదకరమని, దానిని అదుపులో పెట్టుకోకపోతే మిగిలిన అవయవాలు దెబ్బతిని అనారోగ్యానికి గురవుతారని వివరించారు. స్వీట్లు, నూనె, ఉప్పు, కారం మితంగా తీసుకోవటం మంచిదన్నారు. తక్కువగా ఎక్కువసార్లు ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ ప్రభావతిని అవగాహన సభ్యులు సన్మానించారు. సమావేశానికి టి.వి.సాయిరాం సమన్వయకర్తగా వ్యవహరించగా సీనియర్ సభ్యులు గిరిభూషణ్, భాగ్యలక్ష్మి, చంద్రయ్య, కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే, తదితరులు

ఉపాధ్యాయులు సమాజానికి మూల స్తంభాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని కెనడీ నెక్స్ట్‌జెన్ స్కూల్లో ఆదివారం ఏపీ ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ (పిటిఎ) ఆఫీస్ బారియర్స్ వారు సౌత్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌రావు పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్ల కృషి ఎనలేనిదని చెప్పారు. ఉపాధ్యాయులు సమాజానికి మూల స్తంభాలన్నారు. విద్యారంగానికి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి వేల కోట్ల రూపాయాలు ఖర్చు చేస్తోందన్నారు. ఉపాధ్యాయుల కృషిని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ద్వారా తోడ్పాటును ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ అనిల్, సభ్యులు పాల్గొన్నారు.



భోజనం అందిస్తున్న నిర్వాహకులు, సభ్యులు

8 వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని మహానాడు 22వ వార్డులో శ్రీకృష్ణ ద్వారక సేవా సమితి, రాయల్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 8 వేల మందికి అన్నదానం చేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమంతో పాటు కోలాటాలు, నృత్య ప్రదర్శలు జరిగాయి. సేవా సమితి కమిటీ సభ్యులు, రాయల్ ఫ్యాన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మద్దాలి గిరి, మేయర్ తదితరులు

నాణ్యతకు తొలి ప్రాధాన్యమివ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చడానికి నిర్మాణరంగం ప్రధాన పాత్ర పోషిస్తుందని, కావున బిల్డర్లు నాణ్యతతో కూడిన నిర్మాణాలను అందించడం ద్వారా ఖాతాదారుల అభిమానాన్ని పొంది వ్యాపార అభివృద్ధిని కొనసాగించవచ్చని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ అన్నారు. వాసవి కన్స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో ఆత్మకూరి నాగేశ్వరరావు సారథ్యంలో స్థానిక పట్టాభిపురం ఒకటో లైన్‌లో అన్నపూర్ణ రెసిడెన్సీ అపార్ట్మెంట్స్‌కు శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, వైసిపి నాయకురాలు నూరి ఫాతిమా తదితరులతో కలిసి బ్రోచర్ ఆవిష్కరించారు. క్రేన్ గ్రూపు సంస్థల అధినేత జి.వి.ఎస్.ఎల్ కాంతారావు శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ మేయర్లు బాల వజ్రబాబు, షేక్ సజీల, జనసేన నాయకులు నేరెళ్ల సురేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఎ.ఆంజనేయులు, బిల్డర్ శివారెడ్డి, బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నివాసితులకు హక్కు పత్రాలు

- జగనన్న భూరక్షాపథకం ద్వారా సమగ్ర రీ సర్వే
- యాజమాన్య ధ్రువీకరణ జారీకి చర్యలు
- ప్రజాశక్తితో గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి కేశవరెడ్డి



గ్రామాల్లో ఇళ్ల స్థలాలకు డాక్యుమెంట్స్ లేని వారికి జగనన్న భూహక్కు, భూ రక్షా పథకం ద్వారా సమగ్ర ఆస్తి ధ్రువీకరణ పత్రాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.కేశవరెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని నివాసిత కుటుంబాలు తమ ఆస్తిని ఆర్థిక ఆస్తిగా ఉపయోగించుకునేలా యాజమాన్య రికార్డును సిద్ధం చేయటానికి ఈ సర్వే చేపట్టినట్టు వెల్లడించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.



గ్రామకంఠాల్లో ఆస్తి హక్కు పత్రాలు ఎలా ఇస్తారు?

వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షా పథకం ద్వారా నివాసాల సమగ్ర రీ సర్వే ను చేపట్టాం. అన్ని కుటుంబాలను డ్రోన్ టెక్నాలజీ తో సర్వే చేస్తున్నాం. సర్వే పూర్తయిన తరువాత ప్రజల ఆస్తులు ఆక్రమణదారులు, నివాసిత యజమానులకు యాజమాన్య ధ్రువీకరణాల పత్రాల జారీ చేస్తాం. కనీసం ఒకే స్థలంలో 20 ఏళ్లపైబడి నివశిస్తున్నట్టు ఆధారాలు చూపాలి. పన్నుల చెల్లింపులు, ఆధార్ చిరునామాతో కలిగి ఉండాలి.

ధ్రువీకరణ పత్రాల జారీలో వివాదాలు వస్తే?

స్థానికంగా ప్రభుత్వ స్థలాలు, గ్రామకంఠాల్లో నివాసం ఉంటున్న వారికి సమగ్ర ఆస్తి ధ్రువీకరణ పత్రాలను అందించే ఉద్దేశంతో ఈ సర్వేను చేపట్టారు. ఈ ధ్రువీకరణ పత్రాల ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు ఇతర ఆర్థిక ప్రయోజనాలు కూడా పొందేందుకు అవకాశం ఉంటుంది. వివాదాలు రాకుండా రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పూర్తి జాగ్రత్తలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో అందరిని విచారించే నిర్ధారిస్తాం. ఫిర్యాదులు వస్తే విచారిస్తాం.

ఇప్పటి వరకు ఎన్ని గ్రామాల్లో సర్వే పూర్తయింది.?

మొత్తం 202 గ్రామాలకు గాను నాలుగు గ్రామాల్లో పూర్తిగా జరిగింది. మరో 65 గ్రామాల్లో మ్యాప్స్ సిద్ధం చేశాం. ప్రత్తిపాడు మండలం కొండజాగర్లమూడి, దుగ్గిరాల మండలం దేవరపల్లి అగ్రహారం, చింతలపూడి, శృంగారపురం గ్రామాల్లోనే గ్రామ కంఠాల నిర్ధారణ జరిగింది. మరో గ్రామాల్లో వివరాలనమోదు, డ్రోన్ పై సర్వే పూర్తయింది.

పారిశుద్యం నిర్వహణపై పర్యవేక్షణ?

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వహణకు పంచాయతీలు అధిక ప్రాధాన్యమివ్వాలి. గ్రామీణ స్వచ్ఛ సంకల్పం ద్వారా పంచాయతీల్లో పారిశుధ్యం నిర్వహణకు కార్మికుల నియామకం, వాహనాల ఏర్పాటుకు అవకాశం ఇచ్చాం. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని పంచాయతీలను ఆదేశించాం. వర్షాలు నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించాం.

యూజర్ ఛార్జీల వసూలు చేస్తున్నారా?

గ్రామీణ ప్రాంతాల్లోనూ పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించేందుకు ప్రాధాన్యమివ్వాలని పంచాయతీలకు సూచించాం. అన్ని పంచాయతీల్లో రోజుకు రూ.2 చొప్పున నెలకు రూ.60 యూజర్ ఛార్జీలను వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ స్థానికంగా ఉన్న పరిస్థితుల వల్ల చాలా గ్రామాల్లో యూజర్ ఛార్జీల వసూలు చేయడం లేదు.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్వచ్ఛత లఘుచిత్రం షూటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి


స్థానిక ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్లో స్వచ్ఛతా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా రూపొందిస్తున్న లఘుచిత్రం 'స్వచ్ఛత' షూటింగ్ ఆదివారం ప్రారంభమైంది. పాఠశాలో ఆవరణలో చిత్రం షూటింగ్ సందర్భంగా మాటల రచయిత, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ క్లాప్ కొట్టారు. బెల్లంకొండ వెంకట్ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో స్వచ్ఛత కోసం పోరాడితే మనిషికి ఆరోగ్యం, ఆయుష్షు రెండూ మెరుగ్గా ఉంటాయంటూ నటి నఫసా చెప్పిన డైలాగ్‌ను చిత్రీకరించారు. ఈ సందర్భంగా వెంకట్ మట్లాడుతూ స్వచ్ఛత ప్రాధాన్యతను వివరించే విధంగా లఘుచిత్ర నిర్మాణం జరుగుతుందన్నారు. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ క్లీన్ అండ్ గ్రీన్ ప్రధాన అశంగా తెరకెక్కే చిత్రంలో బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన కూడదని, నీటిని పొదుపుగా ఉపయోగించాలన్న సందేశంతో పాటు స్వచ్ఛత సంస్కరణలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పిఇటి హరనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.



క్లాప్ కొడుతున్న ఉమామహేశ్వర్

దేశం పేరు కాదు.. విధానాలు మారాలి..

- పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ సిహెచ్ బాబూరావు
- చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి సభలు - పలుచోట్ల ఘన నివాళులు



గుంటూరులో వర్ధంతి సభలో పాల్గొన్న నాయకులు, వాచ్‌మెన్లు

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రధాని మోడీ మార్చాల్సింది దేశం పేరు కాదని, తమ పార్టీ విధానాలు మార్చుకుంటే ప్రజలకు మేలు జరుగుతుందని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ సిహెచ్.బాబూరావు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ, 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాట అమరుడు సత్తెరపల్లి రామకృష్ణ వర్ధంతి సభ స్థానిక అమరారెడ్డినగర్‌లో నిర్వహించారు. సభకు రజకవృత్తిదార్ల సంఘం నాయకులు ఓలేటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. బాబూరావు మాట్లాడుతూ నైజాం నవాబును మించిన పాలన అటు కేంద్రంలో మోడీ, ఇటు రాష్ట్రంలో జగన్ సాగిస్తున్నారని విమర్శించారు. సంపదంతా దేశంలోని ఇద్దరు కుబేరుల దగ్గరే పోగుపడుతోందని అన్నారు. దేశ సంపదను కొల్లగొట్టి కార్పొరేట్ శక్తులను మోడీ ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. రూ.400 ఉన్న గ్యాస్ బండ నేడు రూ.1200 చేసి ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రూ.200 తగ్గించడం ప్రజల్ని మోసం చేయడం కాదా? అని ప్రశ్నించారు. ప్రజలపై మోడీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే రూ.400కే గ్యాస్ బండ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లులు చూస్తే షాక్ కొట్టేలా ఉన్నాయన్నారు. మోడీ తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోందని దుయ్యబట్టారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో అసలు కంటే కొసరు అన్నట్లు విద్యుత్ బిల్లులు వస్తున్నాయని, దీనికి సర్దుబాటు అనే ముద్దుపేరు పెట్టారని అన్నారు. పెట్రోల్, డీజిల్‌పై కూడా రూ.50 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు వసూలు చేస్తున్నాయని విమర్శించారు. జిఎస్‌టి, సర్దుబాటు ఛార్జీల పేరుతో దోపిడీ పద్ధతి అవలంభిస్తున్నారని పాలక పార్టీలను విమర్శించారు. ఏడాదికి రూ.2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ ఏమైందని ప్రశ్నించారు. రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.భాస్కరయ్య మాట్లాడుతూ ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్న ఎక్కడికక్కడ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోర్టు వివాదాల్లో ఉన్న రాజధాని భూములను ఇళ్లస్థలాలుగా ఇచ్చి జగన్ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ నాయకులు ఎం.రవి మాట్లాడుతూ రాజధాని రైతులకు రూ.5 వేలు ఇస్తానన్న సిఎం హామీ ఏమైందని ప్రశ్నించారు. తొలుత ఐలమ్మ, రామకృష్ణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.వెంకటేశ్వరరావు, పి.సుబ్బారావు పాల్గొన్నారు. పిఎన్ఎం కళాకారులు గంట పాటు వివిధ కళారూపాలు ప్రదర్శించారు.



తాడేపల్లిలో నివాళి

తాడేపల్లి పట్టణంలోని కొత్తూరు చాకలి ఐలమ్మ రజక సొసైటీ కార్యాలయం వద్ద రజక వృత్తిదారుల సంఘం నాయకులు బొజ్జా సుబ్బారావు అధ్యక్షతన సభ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు మాట్లాడారు. నాయకులు ఇ.రామరావు, కె.వీరాంజనేయులు, సిహెచ్.కోటేశ్వరరావు, పి.సాంబశివరావు, ఎ.వీరాంజనేయులు, కె.శ్యాంప్రసాద్, కె.శ్రీనివాస్, నరసింహారావు, మాణిక్యాలు, శివలీల, బాలమ్మ, శకుంతల పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు

తెలంగాణ సాయుధ పోరాటంలో పీడిత ప్రజల కోసం పోరాడిన యోధులు చిట్యాల ఐలమ్మ, విద్యుత్ ఉద్యమ అమరవీరుడు సత్తెనపల్లి రామకృష్ణ ఆశయాలకు పునరంకితం కావాలని ఆంధ్రప్రదేశ్ రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మండూరు వెంకటనరసయ్య అన్నారు. ఐలమ్మ 38వ వర్ధంతి, రామకృష్ణ 23వ వర్ధంతి స్థానిక కృష్ణనగర్‌లోని రజకవృత్తిదారుల సంఘం కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ, రామకృష్ణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అద్దంకి సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటనరసయ్య మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో బానిసత్వానికి వ్యతిరేకంగా తెలంగాణాలో జరిగిన సాయుధ పోరాటంలో ఐలమ్మ ముందుభాగాన నిలిచారన్నారు. 2000 సంవత్సరంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల్లో భాగంగా విద్యుత్ ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా హైదరాబాద్ బషీర్‌బాబు వద్ద జరిగిన పోరాటంలో ప్రభుత్వ తుపాకీ కాల్పులకు ఆనాటి సంఘం రాష్ట్ర కన్వీనర్ రామకృష్ణ బలయ్యాడన్నారు. వారి చూపిన పోరాట మార్గంలో సంఘ సభ్యులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వేంపాటి చిన్నకొండయ్య, సీతయ్య, భాస్కరరావు, కాలేశ్వరరావు, నగరంలోని వివిధ వాచ్‌మెన్ కమ్ ఇస్త్రీదారులు పాల్గొన్నారు.



దాచేపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - దాచేపల్లి

దాచేపల్లిలోని పల్నాడు బలహీన వర్గాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నివాళులర్పించారు. వేదిక జిల్లా అధ్యక్షులు రాజు, ఉపాధ్యక్షుడు షరీఫ్, జిల్లా కార్యదర్శి నాగుల్ మీరా, నియోజకవర్గం అధ్యక్షులు బి.చెన్నయ్య, జి.వెంకటేశ్వర్లు, జె.రమేష్, రహీం, శ్రీకాంత్, పిచ్చయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి

రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాలులర్పించారు. పి.రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర రజక సంఘం ఐక్యవేదిక అధ్యక్షులు పి.అంజిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత రజకచెరువు పార్కులోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలేశారు. కౌన్సిలర్ వి.విజయలక్ష్మి, రజక సంఘీయులు కె.చినవెంకటరమణ, ఎం.పార్వతి, హిమాచలరావు, ఎన్.రాంబాబు, పూర్ణ పాల్గొన్నారు.



తెనాలిలో నివాళి